సీసీరోడ్ల నిర్మాణం ఎన్నడో?

- అధ్వానంగా అంతర్గతరోడ్లు
- అభివృద్ధి నిధులు రూ.53.80కోట్లు మంజూరు
- నెలలు గడిచినా సీసీరోడ్లకు కార్యచరణ చేపట్టకపోవడంపై విమర్శలు

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా 2012లో అప్‌గ్రేడ్ అయింది. మున్సిపాలిటీలో 23 వార్డులు ఉన్నాయి. సుమారు 35వేలకుపైగా జనాభా నివాసం ఉంటున్నారు. అయితే మున్సిపాలిటీకి తగిన విధంగా మౌలిక వసతులు పట్టణంలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.53.80 కోట్లు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. రెండు నెలలు గడుస్తున్నా అభివృద్ధి పనులు కార్యాచరణకు నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని 3, 21 వార్డులను అనుసంధానం చేసే రోడ్డు దారుణంగా ఉంది. గతంలో వేసిన సిమెంట్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా తయారైంది. 4 వార్డులోనూ ఇదే పరిస్థితి. 3, 4 వార్డులను అనుసంధానం చేసే జేఆర్‌పేట రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. ఈ వార్డుల పరిధిలోని అంతర్గతరోడ్లు సైతం సిమెంట్‌రోడ్లకు నోచుకోక దారుణంగా ఉన్నాయి. 5, 6 వార్డుల పరిధిలోని శివారు ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల దుస్థితిలో ఉన్నాయి. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దాటిన తరువాత జేఆర్‌పేటకు వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా ఉంది. 17,19 వార్డుల మధ్యనున్న ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా ఉంది. ఇది కొండ ప్రాంతం కావడంతో నడవాలంటే ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఈ వార్డుల పరిధిలో బీసీలైన మైనార్టీలు, దళితులు అధికంగా నివశిస్తున్నారు. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగించే కుటుంబాలు అధికంగా ఉన్నాయి. తమ వార్డుల వైపు ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించి మౌలిక వసతులైన రోడ్లు, వీధిదీపాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 17వ వార్డు టెక్కే ప్రాంతంలో అంతర్గతరోడ్లు గుంతలతో నిండి కంపచెట్లతో అల్లుకుపోయి చీకటి పడితే విషపురుగులు సంచరిస్తుండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో నిర్మించిన జగనన్న కాలనీలో సుమారు 40 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నాయి. నెల్లూరుపాళెం–ముంబయి రహదారి నుంచి కాలనీలోకి ఉన్న రోడ్డు దారుణంగా ఉంది. వర్షాకాలంలో ఈ దారిలో అడుగు తీసి అడుగువేయాలంటే కష్టంగా ఉంది. తమకాలనీకి సీసీరోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


మున్సిపల్ పరిధిలో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

అన్ని వార్డుల్లో రోడ్లు నిర్మిస్తాం

మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. అన్ని వార్డుల్లోని శివారు ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మరో రెండు నెలల వ్యవధిలో నిర్మాణాలు ప్రారంభిస్తాం.
–సీ గంగాప్రసాద్, కమిషనర్

కొన్ని రోడ్లకే అంచనాలు

మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరైన నేపథ్యంలో కొన్ని వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణ పనుల కోసం కొందరు కౌన్సిలర్లు, కమిషనర్, టీపీఓలు కలిసి రోడ్లను కొలతలు వేస్తున్నారు. దీంతో అన్ని వార్డుల్లో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతారా లేక కొన్ని వార్డులకే పరిమితమవుతారనే అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.


అధ్వానంగా 3, 4 వార్డులను అనుసంధానం చేసే ఎల్ఆర్‌పల్లిలోని రోడ్డు


దారుణంగా 4వ వార్డు పరిధిలో ప్రధాన అంతర్గత రోడ్డు

క్లుప్తంగా

ముగిసిన సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ఏకాంతసేవతో ముగిశాయి. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించి ఏకాంతసేవ జరిపారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ గునుపూడి గిరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



సోమశిల: అనంతసాగరంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కాలువలో పూడికతీత పనులను ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి కూలీల హాజరును పరిశీలించారు. మస్టర్లను పక్కాగా నమోదు చేయాలని మేట్లకు సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటలకు పనులను ప్రారంభించాలని తెలిపారు.

రీసర్వేపై గ్రామసభ

వింజమూరు: బుక్కాపురం పంచాయతీ పరిధిలోని చంద్రపడియలో భూముల రీసర్వేపై గ్రామసభను తహసీల్దార్ హమీద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1997.86 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములు ఉన్నాయన్నారు. తొలుత గ్రామ సరిహద్దులను నిర్ణయించి ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేస్తామని తెలిపారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్వో మీరావలి, సర్వేయర్లు తిరుపతిరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వింజమూరు: స్థానిక జీబీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన కిషోర్‌కు ఉదయగిరి నియోజకవర్గ గౌడ సంఘం ప్రతినిధులు రూ.10 వేలు నగదు సాయాన్ని బుధవారం అందజేశారు. ఇటీవల విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన కిషోర్ మంచానికే పరిమితమైన నేపథ్యంలో భార్య అంజలికి నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు మాల్యాద్రిగౌడ్, మహేష్, మస్తాన్, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంగంలో ఓ మోస్తరు వర్షం



సంగం: మండలంలో బుధవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం కొద్దిగా చల్లబడడంతో ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



ఆత్మకూరు(చేజర్ల): చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎస్ఈఐ గ్రీన్‌ప్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గ్రీన్‌కో ఫౌండేషన్ ద్వారా 12 ఫ్యాన్లను వితరణ చేసింది. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం హైమావతికి కంపెనీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఫ్యాన్లను అందజేశారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాల ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో మదర్‌థెరిస్సా మిరాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శాంసన్, గౌరవాధ్యక్షుడు ఈశ్వర్, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.
సీతారామపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట డీఆర్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి: గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనను అందిస్తున్నామని ఆ పాఠశాల ఉపాధ్యాయులు కే మాలకొండారెడ్డి, ఖాజాఅహ్మద్, .ధనమ్మ, హసీనా తెలిపారు. బుధవారం వారు గండిపాళెంలోని ఇంటింటికి తిరిగి పిల్లలను ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్,, నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు.

వీఆర్వోపై సస్పెన్షన్ వేటు


వీఆర్వో రమణయ్య

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు వీఆర్వోగా పనిచేస్తున్న రమణయ్యపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. నగదు తీసుకుని గృహాలకు సంబంధించి తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేస్తుండడంపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీఆర్వోపై కలెక్టర్ విచారణ జరిపించారు. విచారణలో నగదు తీసుకుని తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లుగా తేలడంతో బుధవారం సస్పెండ్ చేశారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి

కొండాపురం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బొడ్డు అనూరాధ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అధిక శాతం గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొంటుందన్నారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలాధికారులు శాఖలవారీగా చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కలిగిరి: గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మెట్టుకూరి శిరీష తెలిపారు. కలిగిరి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ

పంట కాలువల్లో పూడిక తీయించండి

సంగం: పంట కాలువల్లో పూడికతీయించాలని సంగం, తరుణవాయి గ్రామానికి చెందిన రైతులు కోరారు. సంగంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ వినయ్‌ను బుధవారం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాలువల్లో పూడికతీత చేపడితేనే సజావుగా సాగునీరు అందుతుందని తెలిపారు. రెండో పంటకు సాగు నీరు విడుదల చేసే సమయానికి కాలువల్లో పూడికతీయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఏఈ కాలువలను పరిశీలించి పూడికతీతకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

దుత్తలూరు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజరు షేక్ షాను తెలిపారు. మండలంలోని భైరవరం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే ఆకుకూరలు, చిరుధాన్యాలు, ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్ల గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు నీరజ, సుభాషిణి, పెంచలమ్మ, ప్రమీల, జయమ్మ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

ఆత్మకూరు: అప్రమత్తతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో వంటగ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.
మర్రిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మర్రిపాడు అగ్నిమాపక శాఖ అధికారి వీ పెంచలయ్య ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. బహుళ అంతస్తుల్లో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో మనుషులను ఎలా కాపాడాలో డెమో ద్వారా చూపించారు. అగ్నిమాపక సిబ్బంది బీ పెంచలయ్య, సయ్యద్ ఖాజామొద్దీన్, షేక్ సంధాని, ఎంవీ రాజేష్, ఎస్ వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బీసీకాలనీలో వింజమూరు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎం చంద్రమౌళి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్‌లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అగ్నిమాపక సిబ్బంది మహేంద్ర, మాధవ, ప్రభాకర్, గోపి, తిరుపతి, రమణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.
–ఉదయగిరిలోని ఎస్టీకాలనీలో ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు అందజేశారు.

దెబ్బతిన్న బొప్పాయి తోటల పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండలంలో గాలీవానకు దెబ్బతిన్న బొప్పాయి తోటలను ఉద్యానశాఖ అధికారి సీహెచ్ రాజశేఖరరెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతసాగరం, సంజీవనగరం, గౌరవరం, ఆమనిచిరువెళ్ల, అగ్రహారం, తదితర గ్రామాల్లో బొప్పాయి తోటలు కొంతమేర దెబ్బతిన్నాయని ఆయన చెప్పారు. అధికంగా దెబ్బతిన్న తోటలకు సంబంధించి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతారామపురం/కొండాపురం: సీతారామపురంలోని వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ రామ్మోహన్ మాట్లాడుతూ రసాయనాలు వాడి పండించిన పంటలను తినడం వల్ల ప్రస్తుత జీవన విధానంలో రోగాలు అధికమవుతున్నాయన్నారు. ప్రకృతి విధానంలో పండించిన పంటలతో ముప్పు ఉండదన్నారు. ప్రకృతి విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ట్రెయినీ డీఆర్పీ సురేష్, మండల డీఆర్పీలు రవి, మల్లిబాబు, ఏపీఎం వైనారూత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాపురంలోని ఆదర్శ పాఠశాలలో ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం కాంతారావు, ఎంపీడీఓ ఆదినారాయణ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

చేతిబోరును బాగుచేయించండి

అనుమసముద్రంపేట: మండలంలోని పెద్దబ్బీపురానికి వెళ్లే దారిలో ఆంజనేయ స్వామి గుడి పక్కనున్న చేతిబోరుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందచేశారు. రెండు నెలల క్రితం బోరు మరమ్మతులకు గురైందన్నారు. అప్పట్నుంచి గుడికి వచ్చే భక్తులతో పాటు పొలాల్లోకి వెళ్లే రైతులు, గుడిపాడు, ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

విద్యార్థులకు విందు భోజనం

ఉదయగిరి: దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు హెచ్ఎం జాఫర్‌అహ్మద్ బుధవారం విందు భోజనం వడ్డించారు. ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలీ, టీ శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు విందు భోజనం వడ్డించిన హెచ్ఎంను అభినందించారు. కాంప్లెక్స్ చైర్మన్ బాలకేశవులు, మాలకొండయ్య, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీల స్వయం ఉపాధికి సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తోందని ఎంపీడీఓ అప్పాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 15 యూనిట్ల రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. 21 నుంచి 50 ఏళ్లలోపు కలిగిన అర్హులైన వారు మే 10వ తేదీలోగా ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ కక్షసాధింపు చర్యే

అల్లూరు: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపటం మాలలపై కక్ష సాధింపు చర్యేనని అంబేద్కర్ యువజన సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అల్లూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా తప్పుడు జనాభా లెక్కలతో మాదిగలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. తద్వారా వారిని శాశ్వత ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు కుటిల పన్నాగం పన్నిందన్నారు. అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. ఇలాగే ప్రభుత్వం వ్యవహరిస్తే తాము చూస్తూ ఉరుకోబోమని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

భూసమస్యలను పరిశీలించిన ఆర్డీఓ

సోమశిల: అనంతసాగరం మండలం మంగుపల్లి, ఇనగలూరు, ఆమనిచిరువెళ్ల గ్రామాల్లో ఆత్మకూరు ఆర్డీఓ పావని బుధవారం పర్యటించారు. మంగుపల్లిలో గతంలో రైతుల వద్ద నుంచి ప్రభుత్వం సేకరించిన భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఇనగలూరు, ఆమనిచిరువెళ్ల కొలువు సమస్యలపై పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దారు సుభాషిణి, వీఆర్ఓలు ఉన్నారు.

ముస్లింల గొంతుకోసిన చంద్రబాబు

కావలి: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారంటే అది చంద్రబాబు మద్దతుతోనని, అదే చంద్రబాబు ప్రధాని మోదీ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు తెలిపి ముస్లింల గొంతుకోసారని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలిలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ సిద్ధిక్, రాష్ట్ర మేధావులు ఫోరం అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి షేక్ షాహుల్ హమీద్, సీనియర్ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాయబ్ రసూల్, ఎండీ మునీర్ తదితరులు మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ముస్లింల మతపరమైన, సామాజిక, ఆర్థిక వ్యవహారాలను చూసుకుంటుందన్నారు. ప్రధానంగా మసీదు, దర్గాలకు సంబంధించిన ఆస్తులను సంరక్షిస్తుందన్నారు. అలాంటి వక్ఫ్‌బోర్డులో మోదీ ప్రభుత్వం వక్ఫ్‌సవరణ చట్టం ద్వారా ఇతరుల జోక్యానికి అవకాశం కల్పించడం మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీయడమేనన్నారు. అందుకే వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మైనార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా ఈ నెల 21న ఉదయం కావలి పట్టణంలో చేపడుతున్న ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సోషల్ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి ఎండీ రవూఫ్, కావలి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ గయాజ్, నాయకులు అబ్దుల్లా, వలీ, రఫీ, దస్తగిరి, జమీర్, నూరుద్దీన్, ముస్తాక్, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

రైల్వేలైన్ నిర్మాణానికి సహకరించాలి

ఆత్మకూరు: నడికుడి– శ్రీకాళహస్తి నూతన రైల్వేలైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని కోరారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సచివాలయం వద్ద నెల్లూరుపాళెం, పమిడిపాడు, శాంతినగరం, తదితర గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. రైల్వేలైన్‌కు సంబంధించి భూపరిహారంపై చర్చించారు. రైల్వేలైన్ కోసం నెల్లూరుపాళెం పరిధిలో 41 ఎకరాలను సేకరించనున్నట్లు తెలిపారు. గతంలో ఎకరాకు రూ..9.60 లక్షలు నష్ట పరిహారం ప్రకటించగా, ప్రస్తుతం రూ.15.30 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు భూములు ఇచ్చి సహకరించాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా బోర్లు వేసుకుని పంటలు సాగుచేసుకుంటున్నామని, ఏడాదికి రెండు కార్లు పండే పొలాలకు అంత తక్కువ పరిహారం ప్రకటించడం తమకు సమ్మతంకాదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఎకరాకు మరో రూ.6 లక్షలు అదనంగా రూ.21.30 లక్షలు చెల్లించాలని కోరారు. స్పందించిన ఆర్డీఓ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ బీ పావని

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- వ్యక్తిపై దాడి

కావలి: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. దీనిపై బుధవారం కావలి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారి కథనం మేరకు.. కావలిలోని తుమ్మలపెంట రోడ్డులో నాగరాజు అనే వ్యక్తి లాండ్రీ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా అదే ప్రాంతంలో వెంకటరమణ అనే వ్యక్తి చేపలు అమ్మే దుకాణంలో పని చేస్తున్నాడు. అతడి భార్య నాగరాజు లాండ్రీ షాపులో దుస్తులు ఉతికే పనికి వెళ్తోంది. అతడితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న వెంకటరమణ తన భార్యను పనికి వెళ్లనివ్వలేదు. అయితే ఆమె వెళ్లాల్సిందే అంటూ పట్టుబట్టింది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. మంగళవారం వివాదం తలెత్తగా సదరు వివాహిత సీతారామపురంలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వెంకటరమణ వద్దకు నాగరాజు వెళ్లి నీ భార్యను పనికి పంపించాలని కోరగా అతను పంపనని తెగేసి చెప్పాడు. ఈ నేపథ్యంలో మాట్లాడాలంటూ వెంకటరమణను నాగరాజు సమీపంలో ఉన్న జాతీయ రహదారి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కారులో నలుగురు ఉన్నారు. వెంకటరమణను కారులో ఎక్కించుకుని నాగరాజు నెల్లూరు వైపు తీసుకెళ్లాడు. సున్నపుబట్టి వద్ద వాహనాన్ని ఆపి వెంకటరమణ చేత మద్యం తాగించి తీవ్రంగా కొట్టారు. దీంతో సొమ్మసిల్లి పడిపోయిన అతను బుధవారం ఉదయం తేరుకుని నేరుగా కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. ఈ సమాచారం తెలుసుకున్న కావలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ఆత్మకూరు: గతేడాది ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చకపోతే సమ్మెకు దిగేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మున్సిపల్ కార్మికుల గౌరవాధ్యక్షుడు డేవిడ్‌రాజు, కార్యదర్శి జీ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సయ్యద్ రిజ్వాన్, కార్మికులు జి గురవయ్య, రూబిన్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు